క్లుప్తంగా

కిలో రూ.10 చొప్పన వర్మీకంపోస్టు విక్రయం

తవణంపల్లె: మండలంలోని అరగొండ మేజర్ పంచాయతీ చెత్తసేకరణ కేంద్రంలో తయారయ్యే వర్మీకంపోస్టు ఎరువును రైతులకు విక్రయించడానికి సిద్ధంగా ఉన్నామని డిప్యూటీ ఎంపీడీఓ మురుగేషన్ తెలిపారు. అరగొండ పంచాయతీ చెత్తసేకరణ కేంద్రంలో రెండు టన్నుల వర్మీకంపోస్టు ఎరువు ఉందన్నారు. అవసరమైన రైతులు అరగొండ చెత్త సేకరణ కేంద్రంలో కిలో రూ.10లకు ఎరువులను కొనుగోలు చేసుకోవచ్చని వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్ధగిరి ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి నియామకం కోసం ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను అక్టోబర్ ఒకటో తేదీన పరిశీలించనున్నట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ మునిశేఖర్ తెలిపారు. అర్ధగిరి క్షేత్రంలో బుధవారం ఉదయం 10 గంటలకు ఎండోమెంటు కమిషనర్ పర్యవేక్షణలో దరఖాస్తులను పరిశీలించనున్నట్లు వెల్లడించారు. ధర్మకర్తల మండలి నియామకానికి ఆన్‌లైన్‌లో 15 మంది దరఖాస్తులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఆధార్ కార్డు, కులం సరిఫికెట్, అఫిడవిట్, పోలీస్ సర్టిఫికెట్ తీసుకొని పరిశీలనకు తప్పక హాజరుకావాలని ఇన్‌చార్జ్ ఈఓ మునిశేఖర్ సూచించారు.

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నివారణ

తవణంపల్లె: ప్రజలు అప్రమత్తమై ముందస్తుగా పరీక్షలు చేయించుకుంటే క్యాన్సర్ వ్యాధిని సులభంగా నివారించవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. శనివారం మండలంలోని ద్వారకాపురంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. సీజనల్‌గా లభించే పండ్లు, ఆకుకూరలు, అధికంగా తినాలని సూచించారు. అనంతరం రోగులకు, మహిళలకు, బీపీ, మధుమేహం వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మోహన్ వేలు, సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, పీహెచ్‌ఎన్ జీవకళ, ఆరోగ్య పర్యవేక్షకులు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంసీలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం

గుడిపాల: మండలంలోని చిత్తూరు క్యాంపస్ సీఎంసీ ఆస్పత్రిలో జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సీఎంసీ యాజమాన్యం శనివారం తెలిపింది. అక్టోబర్ 1వ తేదీన జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వచ్ఛందగా ఎవరైనా వచ్చి రక్తదానం చేయవచ్చని వారు తెలిపారు.

సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా హరినాథ్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్ : సీపీఐ పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా జిల్లాకు చెందిన హరినాథ్ రెడ్డి ఎంపికవడం అభినందనీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సెప్టెంబర్ 21 నుంచి 25వ తేదీ వరకు చండీగర్ రాష్ట్రంలో సీపీఐ జాతీయ 25వ మహాసభలు నిర్వహించారన్నారు. ఈ సభల చివరి రోజున ఏపీకి చెందిన 8 మందిని సీపీఐ జాతీయ కౌన్సిల్ మెంబర్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. ఎన్నికైన 8 మందిలో చిత్తూరు జిల్లాకు చెందిన హరినాథ్‌రెడ్డి ఉండడం అభినందనీయమన్నారు. కార్మికుడిగా ఉంటూ వివిధ కేడర్‌లలో పనిచేసి ప్రస్తుతం జాతీయస్థాయి కౌన్సిల్ మెంబర్ స్థాయికి ఆయన ఎదగడం గర్వకారణమన్నారు. ఇదే బాధ్యతతో ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని ఆయన ఆకాంక్షించారు.

బధిరులు అన్ని రంగాల్లో రాణించాలి



బహుమతులు అందజేస్తున్న అతిథులు, అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : బధిరులు అన్నిరంగాల్లో రాణించాలని జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ వినోద్ సూచించారు. శనివారం ప్రపంచ బధిరుల, అంతర్జాతీయ సంజ్ఞా దినోత్సవాన్ని పురస్కరించుకుని జెడ్పీ సమావేశ మందిరంలో కార్యక్రమం నిర్వహించారు. ఏడీ మాట్లాడుతూ ప్రపంచంలో చాలా భాషలున్నా బధిరులకు మాత్రమే సొంతమైన ఒక సంజ్ఞా భాష ఉందన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 3,678 మందికి రూ.4.69 కోట్లతో సహాయ పరికరాలను పంపిణీ చేశామన్నారు. అనంతరం వివిధ రంగాల్లో రాణిస్తున్న బధిరులను దుశ్శాలువతో సత్కరించి బహుమతులను అందజేశారు. డిప్యూటీ సీఈవో వెంకటనారాయణ, వికలాంగుల జేఏసీ రాష్ట్ర నాయకులు మురళి పాల్గొన్నారు.

చీకట్లో చిత్తూరు..

చిత్తూరు నగరంలోని ప్రధాన వీధుల నుంచి శివారు కాలనీల వరకు వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. పలు ప్రాంతాల్లో వీధిదీపాలు సరిగా వెలగకపోవడంతో జనం చీకట్లలోనే మగ్గుతున్నారు. పౌర్ణమి వేళల్లో వెన్నెల వెలుగులు తప్పా.. చాలా చోట్ల వీధిదీపాల వెలుగులు కనిపించడం లేదు. నగరంలోని కొంగారెడ్డిపల్లె, రామ్‌నగర్ కాలనీ, వైఎస్సార్ కాలనీ, ఇందిరా నగర్ తదితర ప్రాంతాల్లో వారం పది రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే సావిత్రమ్మ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న వీధిలో మూడు నెలలుగా వీధి దీపాలు వెలగడం లేదని ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. మున్సిపల్ కమిషనర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– చిత్తూరు అర్బన్



దుర్గానగర్ కాలనీలో వెలగని వీధి దీపం



వైఎస్సార్ కాలనీ వద్ద వెలగని వీధిదీపాలు



దుర్గానగర్‌కాలనీలోని ఓ వీధిలో వెలగని దీపం



సంతపేట ఇందిరా నగర్ వద్ద కమ్ముకున్న చీకట్లు



సావిత్రమ్మ కళాశాల ఎదురుగా ఉన్న ఓ వీధిలో ఓ చోట వెలగని వీధి లైటు

సినీనటుడు సప్తగిరి సందడి



బంగారుపాళెంలో క్రికెట్ ఆడుతున్న సప్తగిరి

బంగారుపాళెం: సినీనటుడు సప్తగిరిప్రసాద్ శనివారం సాయంత్రం బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో సందడి చేశారు. సప్తగిరి ప్రసాద్ ఉన్నత పాఠశాల పూర్వపు విద్యార్థి కావడంతో ఇక్కడకు వచ్చారు. చిన్ననాటి మిత్రులతో ముచ్చటించారు. అనంతరం అక్కడ క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడారు.

వైభవంగా పెరటాశి పూజలు



భక్తులకు అన్నదానం చేస్తున్న దాతలు

నగరి: గోవింద భక్తులకు ప్రత్యేకమైన పెరటాశి నెల శనివారం పూజలను నగరి పట్టణ పరిధిలో టీడీడీ ఆధీనంలో ఉన్న శ్రీభూదేవి, శ్రీదేవి సమేత కరియమాణిక్య స్వామి ఆలయంలో, సత్రవాడ శ్రీభూనీలా సమేత కరివరదాజ స్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ అధికారి వెంకటరమణ భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయాల వద్ద దాతలు భక్తులకు అన్నదానం చేశారు.

మహిళ ఆరోగ్యంతో కుటుంబ భద్రత

ఐరాల: మహిళ ఆరోగ్యం బలమైన, శక్తివంతమైన కుటుంబానికి పునాది అని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరమని కాణిపాకం పీహెచ్‌సీ వైద్యాధికారులు స్వాతిసింధూర, రాజేశ్వరి తెలిపారు. శనివారం పీహెచ్‌సీలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ మహిళలు క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు సీజనల్ వాధ్యుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. నోట్లో పుండ్లు రావడం, రొమ్ము క్యాన్సర్, గైనిక్ సమస్యలు వస్తే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. మహిళలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణ సేవలు బలోపేతం చేయడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రత్యేక వైద్య శిబిరంలో



మాట్లాడుతున్న వైద్యాధికారి స్వాతిసింధూర

స్పెషలిస్ట్ డాక్టర్లు మహిళలకు ఎన్‌సీడీ స్క్రీనింగ్, టీబీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. జిల్లా ప్రభుత్వాస్పత్రి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన జిల్లా బీజేపీ అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు, నాయకులను అభినందించారు. ఐసీడీఎస్ సీడీపీఓ నిర్మల మాట్లాడుతూ గర్భిణులు ఆహారంలో సమతుల ఆహారం ఉండేలా చూసుకోవాలని సూచించారు. బిడ్డకు 6 నెలలు నిండేదాకా తల్లిపాలే మంచి పౌష్టికాహారమని తెలిపారు. చిరుధాన్యాలు, తృణధాన్యాలు ఏ విధంగా వాడాలో వివరించారు. మునగాకు పొడి చేసుకుని గర్భిణులు ప్రతిరోజూ ఆహారంలో చేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషలిస్ట్ డాక్టర్లు అనుశక్తి, శ్రీధర్ బాబు, వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ఎంపీహెచ్‌ఈఓ శివయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు, పీహెచ్‌ఎన్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు తరచూ ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలి



బాలింతలకు సీమంతం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రతి మహిళ కుటుంబానికి వెన్నెముక లాంటిదని, మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం సుఖ సంతోషాలతో ఉంటుందని ఎంపీ దగుమళ్ల ప్రసాద్ రావు తెలిపారు. శనివారం చిత్తూరు నగరం మురుకంబట్టులోని ఓ కల్యాణ మండపంలో జిల్లావైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించి గర్భిణులకు సామూహిక సీమాంతం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలకు ఆరోగ్యం పట్ల అవగాహన ఉండాలన్నారు. ముందస్తుగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వైద్యసేవలు, పరీక్షలు చేశారు. కార్యక్రమంలో చుడా చైర్మన్ కఠారిహేమలత, డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి, డీసీహెచ్‌ఎస్ పద్మాంజలి, టీబీ అధికారి వెంకట ప్రసాద్, డీఐఓ డాక్టర్ హనుమంతరావు, ప్రోగ్రాం అధికారులు, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరీ, సీడీపీఓ శ్యామ్‌సుగుణకుమారి పాల్గొన్నారు.

సరస్వతీ నమోస్తుతే..



లలితా త్రిపురసుందరి దేవిగా పాలేటమ్మ



దుర్గాదేవి అలంకరణలో చాముండేశ్వరి దేవి



అలంకరణలో బోయకొండ గంగమ్మ



కరెన్సీ నోట్లతో ఓంశక్తి అమ్మవారికి అలంకరణ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నగరంలోని దసరా శరన్నవరాత్రులు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. అమ్మవారు బహురూపాల్లో దర్శనమిస్తున్నారు. విశేష పూజలందుకుంటున్నారు. అమ్మవారు ఆలయాన్నీ కూడా భక్తులతో సందడిగా మారుతోంది. శనివారం ఉత్సవాలు విశేషంగా జరిగాయి. దుర్గాంబ దేవస్థానంలో సరస్వతీదేవి అలంకరణ, కోదండరామస్వామి ఆలయంలో నారసింహావతారం, ఆంజనేయస్వామి ఆలయంలో దత్తాత్రేయస్వామి అలంకరణ, సాయిబాబా ఆలయంలో మహాచండి అలంకరణలో స్వామివారు భక్తులకు అభయమిచ్చారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: బంగారుపాళెం గ్రామ దేవత శ్రీముత్యాలమ్మ శనివారం శ్రీమహాలక్ష్మీదేవిగా భక్తులకు అభయమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు మురళీ గురుకుల్ అమ్మవారి ఉత్సవమూర్తిని వివిధ రకాల సుగంధ పుష్పాలతో శ్రీమహాలక్ష్మీదేవిగా అలంకరించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమూర్తి, జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా భక్తులు పాల్గొన్నారు.

వజ్రాలపురంలో..

మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ శనివారం శ్రీమహాలక్ష్మీదేవిగా భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా అమ్మవారిని, ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారిని చూసి తరించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు వజ్రాలపురానికి తరలివచ్చారు. ఉత్సవానికి బొమ్మాయిపల్లికి చెందిన మహాలక్ష్మి, తులసి ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులకు ఆలయం వారిచే తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఉభయదారులుగా వ్యవహరించారు. అదేవిధంగా ఓంశక్తి ఆలయం, తగ్గువారిపల్లె దండుమారెమ్మ, మొగిలివెంకటగిరి గంగమ్మ ఆలయాల్లో అమ్మవారికి విశేషపుజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఐరాలలో..

ఐరాల: స్థానిక పాలేటమ్మ ఆలయంలో ఉదయం అమ్మవారికి అభిషేకం, సుగంధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పాలేటమ్మను లలితా త్రిపురసుందరిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వైఎస్ గేటులో చాముండేశ్వరి దేవికి దుర్గాదేవి అలంకరణ చేపట్టారు. పాతపాళ్యంలో ఓంశక్తి అమ్మవారిని కరెన్సీ నోట్లతో ధనలక్ష్మి దేవిగా అలంకరించారు.

గుడిపాలలో..

గుడిపాల: మండలంలోని కందగిరి కొండవద్ద ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఉన్న మూలస్థాన దుర్గమ్మ అమ్మవారు లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే పిల్లారికుప్పంలో ద్రౌపదీదేవి అమ్మవారు లలితా త్రిపురసుందరీదేవిగా, పల్లూరు గంగమ్మ అమ్మవారు లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

గుండె వ్యాధులపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

తవణంపల్లె: ప్రపంచ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని గాజులపల్లెలో అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులచే గుండె వ్యాధులపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 29వ తేదీన ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా ముందస్తుగా అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.లోకేశ్వరి పర్యవేక్షణలో ర్యాలీ నిర్వహించారు. గాజులపల్లె పురవీధుల్లో ర్యాలీ చేస్తూ ఆరోగ్యకరమైన గుండె సంతోషకరమైన జీవితం, మన హృదయం మన బాధ్యత, హృదయం బలంగా ఉంటే జీవితంలో వెలుగులు ఉంటాయని నినాదాలు చేశారు. అనంతరం గాజులపల్లెలోని కూడలి ప్రాంతంలో మానవహారం నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శోభారాణి, ప్రోగ్రాం అధికారి మౌనిక, రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

రేబిస్.. ఆదమరిస్తే ప్రాణాంతకమే

- జిల్లాలో పెరుగుతున్న కుక్క కాటు బాధితుల సంఖ్య
- కుక్క కరిచిన వెంటనే ఆస్పత్రికి వెళ్లాలంటున్న వైద్యులు
- నిర్లక్ష్యంతో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సలహా
- జాగ్రత్త పడకపోతే ప్రమాదమే అని హెచ్చరిక

జంతు ప్రేమికుల్లో అధికంగా కుక్కలకు అధికంగా అమితంగా ప్రేమిస్తారు. ఇష్టపడి పెంచుంతుంటారు. దీంతో పాటు వీధికుక్కలను సైతం చాలామంది వెంటబెట్టుకుని తిరుగుతుంటారు. పల్లెల్లో పెంచి పోషిస్తుంటారు. అయితే అవి కరిస్తే ఎంత ప్రమాదకరమో ప్రేమికులు తెలుసుకోవడం లేదు. ఆ కాటు రేబిస్‌కు దారితీస్తుందని విషయాన్ని గుర్తించలేకపోతున్నారు. ప్రముఖ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ జ్ఞాపకార్థం ఏటా సెప్టెంబర్ 28ని వరల్డ్ రేబిస్ డేగా జరుపుతారు. జంతువులపై రేబిస్ ప్రభావంపై అవగాహన పెంచడం, వ్యాధి నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలనేది ఈ వరల్డ్ రేబిస్ డే ముఖ్య ఉద్దేశం.



కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం (ఫైల్)

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రస్తుత పరిస్థితుల్లో కుక్క కాటుకు గురవుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. అయితే కుక్క కాటు వేస్తే వైద్యం తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాంతకమే అంటున్నారు వైద్యనిపుణులు. కుక్క కాటు కారణంగా మనుషులకు రేబిస్ వ్యాపిస్తుంది. వాతావరణంలో మార్పులు సంభవించి వేడి ఎక్కువైన సందర్భాల్లో కుక్కల్లో తిక్క పెరిగిపోతుందని పరిశోధకులు గుర్తించారు. ఈ సమయంలో తమ ముందున్నది యజమాని అయినా.. మరొకరైనా చిరాకొచ్చి కరిచేస్తుంటాయి. ఈ సందర్భంలో ఆ కుక్కలో రేబిస్ వైరస్ ఉంటే అది ఆ మనిషిలోకి చేరుతుంది. రేబిస్ అనేది ప్రాణాంతకమైన వ్యాధి. అయితే ఈ వ్యాధిని విజయవంతంగా నివారించే వీలుంటుంది. ఈ వైరస్ సోకిన జంతువుల లాలాజలం నుంచి మనుషులకు వ్యాపిస్తుంది. వీధి కుక్కలు లేదా టీకాలు వేయని కుక్కల నుంచి వ్యాప్తి చెందుతుంది.

లక్షణాలు ఎలా ఉంటాయంటే..!

రేబిస్ సోకిన వారిలో తలనొప్పి, విపరీతమైన జ్వరం, లాలాజల పక్షవాతం, మానసిక రుగ్మత, ఆందోళన వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొన్ని సందర్భాల్లోనే మరణానికి దారితీస్తుంది. వీధి కుక్కల ద్వారా ఈ వ్యాధి ఎక్కువగా వ్యాపిస్తుంది. గొంతులోని అవయవాలు పనిచేయక పక్షవాతానికి గురైనట్లు కనిపిస్తాయి.

నివారణ ఇలా..

కుక్క కాటు గాయాలకు త్వరగా టీకా తీసుకోవాలి. రేబిస్ సోకిన కుక్క కరవగానే కరిచిన చోట వెంటనే సబ్బుతో శుభ్రంగా కడగాలి. రక్తం కారకుండా మంచి వస్త్రంతో మెల్లగా తుడవాలి. యాంటీ బయోటిక్ క్రీమ్ అందుబాటులో ఉంటే రాయాలి. బ్యాండేజీతో గాయం చుట్టూ చుట్టాలి. అవకాశం ఉంటే అయోడిన్ సొల్యూషన్ వేయాలి. ఇలా చేయడం వల్ల 90 శాతం రేబిస్ బారిన పడకుండా చూడవచ్చు. అవసరమైతే యాంటీసెప్టిక్ లోషన్ అప్లై చేయాలి. ధనుర్వాతం రాకుండా టీటీ తీసుకోవాలి. గాయం పెద్దదైతే మానడానికి యాంటీ బయోటిక్స్ వాడాలి. ఐవీ ఇమ్యునో వ్యాక్సిన్ తీసుకోవాలి. ఇంట్లో పెంచుకునే వాటికి సమయాన్ని బట్టి వ్యాక్సిన్ వేస్తూ ఉండాలి.

గణనీయంగా పెరిగిన కుక్కకాటు కేసులు

జిల్లాలో 1.50 లక్షల వీధి కుక్కలున్నాయి. పెంపుడు కుక్కలు 45వేలకుపైగా ఉన్నట్లు పశుసంవర్ధశాఖ అధికారులు లెక్కకట్టారు. గతేడాది కంటే ఈ ఏడాది కుక్కల సంఖ్య గణనీయంగా గుర్తించారని సర్వేలో నిర్ధారించారు. ఈ క్రమంలో కుక్క కరిచి ఆస్పత్రికి వస్తున్న వారి సంఖ్య కూడా పెరుగుతున్నట్లు ఆస్పత్రిలో కుక్కకాటు గణాంకాలు చెబుతున్నాయి.

సీజనల్ వ్యాధులతో పశువులకు పెనుముప్పు



ఏఎల్‌పురంలో పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ సాయిసుధ

గుడిపాల: పాడి పశువులకు సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారులు సాయిసుధ, రవితేజ అన్నారు. ఏఎల్‌పురం, బొమ్మసముద్రంలో శనివారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి పశువులకు గాలికుంటు వ్యాధి, పాదుగువాపు వ్యాధి, గొంతువాపు వ్యాధి వంటి సీజనల్ వ్యాధులు సోకుతున్నాయని తెలిపారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల వ్యాధుల నుంచి పశువులను రక్షించుకోవచ్చన్నారు. జ్వరం, గొంతువాపు, ముక్కులో నుంచి చీమిడి కారడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే పశువైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లి వైద్యం అందించాలని సూచించారు. అనంతరం 300 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు.